క్లుప్తంగా

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈఈ రాధాకిషన్ అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో 13వ తేదీన భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద, 14వ తేదీన దేవమ్మ బస్తీ గణేష్ మండపం వద్ద, 15వ తేదీన రాజీవ్ గృహకల్ప, సంజయ్‌పురి కాలనీలలో కమ్యూనిటీహాల్ వద్ద బిల్లులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



సాయిలక్ష్మి లేఅవుట్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ 23వ డివిజన్ సాయిలక్ష్మి లేఅవుట్‌లో సోమవారం కంటి వెలుగు కేంద్రాన్ని మేయర్ కొలన్ నీలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధ పడుతున్న ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. తీవ్ర కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్ యాదవ్, 5వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రజీత్‌రెడ్డి, ఎన్విరానిమెంట్ ఇంజినీర్ సుకృత, డాక్టర్ భవానీప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవిరూపాక్ష దేవీ ఆలయ వార్షికోత్సవాలు

కుత్బుల్లాపూర్: చింతల్ ద్వారకపురికాలనీలోని శ్రీవిరూపాక్ష దేవీ పోచమాంబ సహిత సూర్యమాంబ సమేత కంఠమేశ్వర, సుబ్రహ్మణ్య ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 13న గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, 14న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 15న నవ చండీహోమం పూజలు ఉంటాయని పేర్కొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మనూలో జాబ్ ఫెయిర్

రాయదుర్గం: విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు.సోమవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, గ్యాలెక్సీ ప్లేస్‌మెంట్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. టీపీసీ ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ యూసుఫ్‌ఖాన్ మాట్లాడుతూ 58 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయన్నారు.

డ్వాక్రా రుణాల డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి



బ్యాంక్ రుణాల డాక్యుమెంటేషన్‌కు హాజరైన డ్వాక్రాగ్రూపు మహిళలు

కుత్బుల్లాపూర్: డ్వాక్రా గ్రూప్ సంఘాల వారికి రుణాలు అందజేసే విషయంలో బ్యాంకు సిబ్బంది డాక్యుమెంటేషన్ ప్రక్రియ చేపట్టారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 72 గ్రూపులకు పావలా వడ్డీ రుణాల కింద రెండు కోట్ల 42 లక్షల రూపాయలను అందించే ప్రక్రియలో భాగంగా సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద మహిళల డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటికే పలు పర్యాయాలు రుణాలు పొంది సక్రమంగా తిరిగి చెల్లించిన వారికి రుణాలు అందాయన్నారు. ఒకేసారి 72 గ్రూపులను పరిశీలన నిమిత్తం పిలవడంతో అక్కడ మహిళలతో సందడిగా మారింది. ప్రాజెక్టు అధికారి హరిప్రియ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కనకమల్లు, కిషోర్ ఉన్నారు.

దోస్త్ కాలేజీల జాబితాల్లో చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో కొనసాగుతున్న నాన్ దోస్త్ కాలేజీలను దోస్త్ జాబితాలో చేర్చాలని ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్స్ కోరారు. సోమవారం ఓయూ దూరవిద్య సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్ ఆధ్వర్యంలో నాన్ దోస్త్ కాలేజీల నిర్వాహకుల సమావేశం జరిగింది. నాన్ దోస్త్ జాబితాలోని 61 కాలేజీల్లో డిగ్రీ విద్యార్థులు చేరడం లేదని ఫీజుల విషయంలో కూడా దోస్త్, నాన్ దోస్త్ కాలేజీలకు నడుమ వ్యత్యాసం ఉందని, ఒకే ఫీజు విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాన్ దోస్త్ కాలేజీ నిర్వాహకుల అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ప్రొ.లింబాద్రి పేర్కొన్నారు.

మందుబాబుల హల్‌చల్!

- మాకేమైనా జరిగితే అధికారులదే బాధ్యత: స్థానికులు
- అటుగా వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు, పిల్లలు
- 100 ఫీట్ రోడ్డులో హంగామా సృష్టిస్తున్న తాగుబోతులు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ 100ఫీట్ రోడ్డులో నివాస గృహాల మధ్య వెలిసిన వైన్ షాపు ఉండటంతో అటు వైపు నుంచి మహిళలు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఆ వైన్ మీదనే బారులా పర్మిట్ రూమ్ కొనసాగుతోంది. పైనే కాకుండి రోడ్డు మీదనే మందుబాబులు తాగుతూ నానా హంగామా సృష్టిస్తోంది. వైన్ షాప్ పక్కనే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అక్కడనే గుంపులుగా మద్యం మత్తులో అరుస్తున్నారు. తాగుబోతులు అటుగా వెళ్తున్న పిల్లల చేతుల్లోని ఫోన్లు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. తమకు, పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరిగినా పోలీసులు, మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని స్థానిక మహిళలు అంటున్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే తాగుబోతుల బెడద ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

◆ ఇప్పటికే అపార్ట్‌మెంట్ల వాసులు ఉపకమిషనర్ మంగతాయారుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రభావతికి గుడిసెలు తొలగించే బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ అధికారి అదిగో ఇదిగో అంటూ పది రోజులుగా వాహనాలు లేవంటూ కాలయాపన చేస్తుండటం గమనార్హం. ఇదే విషయంపై సాక్షి ప్రతినిధి టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రభావతిని వివరణ కోరగా రెండు రోజుల్లో వాహనం సమకూర్చి అక్కడ వెలసిన గుడిసెలను తొలగిస్తామని చెప్పారు.

వాహనాలకు అడ్డుగా వస్తున్న మందుబాబులు

వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలోనే వైన్స్ ఉండటంతో వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మద్యం బాటిళ్లను రోడ్డు పక్కనే పడేస్తూ.. మద్యం మత్తులో రోడ్డు దాటుతూ ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొంటున్నారు. గతంలో ఇదే వైన్ షాప్ ఎదుట ఓ వ్యక్తి కాలువలో పడి గల్లంతై వారం రోజుల తర్వాత శవమై తేలినా అధికారుల్లో చలనం లేకుండా పోయింది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశం..

వైన్ షాప్ ఎదుట హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశం ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి స్పందన లేదు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా తెలంగాణ రన్



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న సీపీ స్టీఫెన్‌రవీంద్ర. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్, అధికారులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 'తెలంగాణ రన్'అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు.

◆ కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ రన్ ఐడీపీఎల్ వరకు కొనసాగి తిరిగి మున్సిపల్ గ్రౌండ్ వద్ద ముగిసింది. ఈ రన్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటులు విశ్వక్ సేన్, నందిత శ్వేతలు రన్‌లో పాల్గొని పాటలతో హుషారెత్తించారు.

◆ ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ కమిషనర్ మమత, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, డీసీపీలు సందీప్, శ్రీనివాసరావు, ఏసీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగారాం, రామలింగరాజు, డీసీలు మంగతాయారు,ప్రశాంతి, మున్సిపాలిటీ కమిషనర్లు శ్రీహరి, రామకృష్ణారావు, సత్యనారాయణ, సీఐలు పవన్, ప్రశాంత్, క్రాంతి కుమార్, సుమన్, భాస్కర్, వెంకట్ రెడ్డి, నరహరి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ నటుడు విశ్వక్ సేన్

బీసీ రుణం.. ధ్రువీకరణ పత్రాల కోసం!



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి వివిధ ప్రతాల కోసం తరలి వచ్చిన జనం

సుభాష్‌నగర్: బీసీల కులవృత్తులు, చేతివృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. ఇందుకు దరఖాస్తుదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలి. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి ఐదు రోజుల నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం జనాల తాకిడి పెరిగింది. అత్యధిక జనాభా కలిగిన ప్రాంతం కావడంతో నిత్యం వందల సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జనాల తాకిడిని దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నామని తెలిపారు.

'మా సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించాలి'

జగద్గిరిగుట్ట: మగ్దూంనగర్ నుంచి హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డు వరకు 60 ఫీట్ల రోడ్డును నిర్మించి ప్రజల సమస్యను తీర్చాలని గతేడాది జూలై 30న మైత్రీవనంలోని హెచ్‌ఎండీఏ సెక్రటరీ చంద్రయ్యకు స్థానికులు విన్నవించుకున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా.. 60 ఫీట్ల రోడ్డుకు అడ్డంకులు రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ఇవేమీ పట్టించుకోకుండా రోడ్డు వేయాల్సిన స్థలంలో కూడా చదును చేయడం మొదలు పెట్టారు. స్థానికంగా ఉన్న నాయకులు శేకర్ యాదవ్, ఐలయ్య గౌడ్, రషీద్, రాజు యాదవ్, పాపిరెడ్డి తదితరులు హెచ్‌ఎండీఏ సిబ్బంది చేస్తున్న పనులను నిలిపివేయించారు. అధికారులు తమ సమస్యను అర్థం చేసుకొని పరిష్కరం చూపాలని స్థానికులు ప్రజలు కోరారు.

రోడ్ల విస్తరణ పనులు వేగంగా పూర్తిచేయాలి



దూలపల్లి మెయిన్‌రోడ్డులో జరుగుతున్న కల్వర్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్ల విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలు వివేకానంద్, మైనంపల్లి హన్మంతరావు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి మెయిన్ రోడ్డులో రూ.8.45 కోట్ల ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపడుతున్న కల్వర్టు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను సోమవారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు అనుగుణంగా కల్వర్టు నిర్మాణ పనులను పెంచాలన్నారు. అందుకు నిధులు అవసరమైతే కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 40శాతం మేర పనులు పూర్తి కావడంతో మిగిలి ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నారాయణ, డీఈ నరేందర్, ఏఈ లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులకు శ్రీకారం



వెన్నెలగడ్డ ఎన్నా చెరువు వద్ద పనులను పర్యవేక్షిస్తున్న సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ ఎన్నా చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎఫ్‌టీసీ ద్వారా చేపట్టిన పనులను సోమవారం కూకట్‌పల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య పరిశీలించారు. కొన్ని నెలలుగా చెరువు మొత్తం గుర్రపు డెక్క విస్తరించి ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ చెరువుపై ప్రత్యేక దృష్టి సారించారు. కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఉమారాణి పర్యవేక్షణలో సూపర్‌వైజర్ యాదగిరి, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు గుర్రపు డెక్కను తొలగించే పనులు చేపట్టారు.

'మెషిన్ లెర్నింగ్'పై అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 28 తేదీల్లో 'మెషిన్ లెర్నింగ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై 3 రోజుల అధ్యాపక వికాసంపై అవగాహన సదస్సు (ఎఫ్‌ఎపీ) నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ మంజునాథాచారి సోమవారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఇంజనీరింగ్, టెక్నాలజీకి ఎలా అన్వయించవచ్చో అర్థం చేసుకోవడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడానికి దీనిని రూపొందించినట్టు తెలిపారు. ఈఎఫ్ఎపీని విద్యావేత్తలు, పరిశోధన స్కాలర్లు, బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ చదివే వారికోసం ఉద్దేశించామని, ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు డాక్టర్ రామకృష్ణ 81060 21619ని సంప్రదించాలని సూచించారు.

విజయవంతంగా అరుంధతి ఆస్పత్రి వైద్యుల శస్త్రచికిత్స



దుండిగల్: ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామని అరుంధతి ఆస్పత్రి ఫౌండర్ మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గత నెల 31వ తేదీన సంజీవ(57) అనే వ్యక్తికి గుండె నొప్పి రావడంతో దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో చేర్పించారు. అతడిని పరీక్షించిన వైద్యులు గుండెలో రక్తనాళాలు పూడుకుపోయాయని నిర్ధారించారు. వెంటనే అతని గుండెకు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. అరుంధతి ఆస్పత్రిలో ఉచితంగా తనకు ఆపరేషన్ చేసి పునర్జన్మ ఇచ్చారని రోగి సంజీవ అన్నారు. ఆస్పత్రి వారికి ఎప్పటికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సమావేశంలో కార్డియాలజిస్ట్ సాయిరాం, డీన్ ఉదయ్‌కుమార్, డాక్టర్లు శ్రీనివాస్, ఉమా కార్తిక్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మల్లంపేటలోని 22వ వార్డులో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. ఇప్పటికే మెజార్టీ స్థాయిలో పనులను పూర్తి చేశామన్నారు. త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శామీర్‌పేట సంధ్య, వెంకటేశం, నేతలు ఆంజనేయులు, హనుమంతరావు, రాఘవేందర్‌గౌడ్, రవిందర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

పలు కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్కిల్ ట్రెనింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలతో తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్కు, జ్యూట్ బ్యాగ్స్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫొటో, ఆధార్‌కార్డ్‌తో సంప్రదించాలని కోరారు. శిక్షణ అనంతరం వారికి బ్యాంకుల నుంచి ముద్రా లోన్స్ కోసం సహకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9396161936.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

ప్రజావాణిలో సీపీఐ నేతల ఫిర్యాదు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలంలో పేదలు గదులు నిర్మిస్తే కూల్చివేసే అధికారులు.. అదే పెద్దలు నిర్మిస్తే వత్తాసు పలుకుతున్నారని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. బాచుపల్లి మండల పరిధిలోని సర్వే నం.90, 94లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే నెంబరు 90, 94లలోని ప్రభుత్వ భూమిలో పెట్రోల్ బంక్‌ను ఆనుకని గదులు నిరిస్తున్నారని తెలిపారు. ఏపీఆర్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించిందన్నారు. కొందరు నిర్మాణదారులు అనుమతులకు మించి అంతస్తులు చేడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సీపీఐ నాయకులు శివ, యాదయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు



ర్యాలీగా వస్తున్న యువజన నాయకులు

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. – దుండిగల్





శుభాకాంక్షలు తెలుపుతున్న అంజన్‌కుమార్ యాదవ్ , నందికంటి శ్రీధర్

వార్డు కార్యాలయాల్లో సత్వర సేవలు

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ మమత

కుత్బుల్లాపూర్: పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయాల విషయంపై సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధ్యక్షతన వార్డు బాధ్యులతో సమీక్ష నిర్వహించారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 8 డివిజన్లలో ఈ ప్రక్రియ ఇప్పటికే తుది దశకు చేరుకోవడంతో ఆయా డివిజన్ల వారీగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లను నియమించిన విషయం తెలిసిందే. పారిశుద్ధ్యం, ఎలక్ట్రిసిటీ, మంచినీరు, వైద్య ఆరోగ్యం, ఇతర సేవలను ప్రజలు సత్వరం పొందేలా ఈ వార్డు కార్యాలయాలు ఉంటాయని జెడ్‌సీ మమత పేర్కొన్నారు.

◆ ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. చిన్న చిన్న సమస్యలకు కార్యాలయాలు చుట్టూ తిరిగే ప్రజలకు ఈ వార్డు కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సమావేశంలో ఉపకమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి, జోనల్ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ చిన్నారెడ్డి, కృష్ణచైతన్య, వివిధ వార్డు ఏఎంసీలు సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించని కార్పొరేటర్లు..!

జంట సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయాల విషయంపై మంత్రి కేటీఆర్ ఆదేశాలతో జోనల్ కమిషనర్ మమత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 8 మంది కార్పొరేటర్లు డుమ్మా కొట్టడం గమనార్హం. సమాచారం ఇచ్చిన ఏ ఒక్కరూ ఈ సమావేశానికి హాజరు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు నేరుగా సేవలు అందించాలని లక్ష్యంతో మంత్రి కేటీఆర్ ఆలోచనతో ఏర్పాటు చేస్తున్న ఈ వార్డు కార్యాలయాల సమీక్ష సమావేశంలో మొత్తం ఆయా డివిజన్ల వారీగా అధికారులు పాల్గొనగా కార్పొరేటర్లు మాత్రం కనిపించకలేదు.